క్లుప్తంగా

భావనారుషి ఆలయం వద్ద అన్న సమారాధన



పసలపూడిలో నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

రాయవరం: పసలపూడిలో శ్రీభద్రావతి సమేత భావనారుషి ఆలయం వద్ద ఆదివారం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. వినాయక చతుర్థి ఉత్సవాలు ముగిసిన అనంతరం ఏటా ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మార్కండేయ పద్మశాలి సంఘం నేతృత్వంలో జనార్ధన శర్మ అర్చకత్వంలో తొలుత ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో పసలపూడి పరిసర గ్రామాలకు చెందిన రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



పిరమిడ్ మాస్టర్ పద్మావతిని సత్కరిస్తున్న సత్యసాయి భక్తులు

రాయవరం: స్థానిక సత్యసాయి ధ్యాన మందిరంలో ఆదివారం ఉచిత ధ్యాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రతి నెలా అమావాస్య రోజున వెలగల వెంకటరెడ్డి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నిర్వహించిన ధ్యాన శిబిరంలో కాకినాడకు చెందిన పిరమిడ్ మాస్టర్ పద్మావతి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత కలిగి ఆరోగ్యం మెరుగడంతో జీవన ప్రమాణం పెరుగుతుందని తెలిపారు. రాయవరం, సోమేశ్వరం, పులుగుర్త తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ధ్యాన శిబిరంలో పాల్గొని ధ్యాన శిక్షణ పొందారు. పిరమిడ్ మాస్టర్ పద్మావతిని ఈ సందర్భంగా సత్యసాయి మందిరం భక్తులు ఘనంగా సత్కరించారు. ధ్యాన శిబిరంలో రాయవరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, కొమరిపాలెం తదితర గ్రామాలకు చెందిన యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో స్వచ్ఛతా హీ సేవ

రామచంద్రపురం రూరల్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు పురస్కరించుకుని గ్రామాల్లో చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం ద్రాక్షారామలో పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ పర్యవేక్షించారు. రోడ్ల వెంబడి చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు శుభ్రం చేయించారు. వీధుల్లోని చెత్తను తొలగించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

కె.గంగవరం: ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం రోజున జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పామర్రు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఏట రమణను ఆదివారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కాంప్లెక్స్ చైర్మన్ ఎర్రి ఈశ్వరుడు, కూళ్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, సీఆర్‌పీ నాగరత్నం ,పాఠశాల ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, మల్లికార్జునుడు, వానపల్లి వాసు, అవసరాల వెంకట్రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జగన్నాథపురానికి చెందిన కొత్తవలస సత్యరావు తన బైక్‌పై ద్రాక్షారామలోని తన స్నేహితుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. గొల్లపాలెం పాల్కాని చెరువు మలుపు వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సత్యరావు తీవ్ర గాయాలపాలవ్వగా స్థానికులు అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్యను హింసించిన భర్తపై కేసు నమోదు

కె.గంగవరం: మద్యానికి బానిసై భార్యను హింసిస్తున్న భర్తను కె.గంగవరం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కె.గంగవరం ఎస్సై జానీ భాషా తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఊడిమూడికి చెందిన మంచిగంటి బేబికి 15 ఏళ్ల క్రితం ఏ.వేమవరానికి చెందిన రామకృష్ణతో వివాహమైంది. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన రామకృష్ణ ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీనిపై భార్య ప్రశ్నించడంతో రామకృష్ణ కోపోద్రిక్తుడై ఆమెను క్రూరంగా హింసించాడు. బాధితురాలు బేబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి భర్త రామకృష్ణను అరెస్టు చేశారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- చలువ పందిళ్లు ఏర్పాటు
- ఆలయాలను సుందరంగా అలంకరిస్తున్న ఉత్సవ కమిటీలు
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం



వెదురుపాక విజయదుర్గ అమ్మవారు



రాయవరంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ముస్తాబైన దుర్గాదేవి ఆలయం

రాయవరం: చెడుపై మంచి విజయం సాధించినందుకు సూచికగా జరుపుకునే శరన్నవరాత్రి వేడుకలకు ఊరూ వాడా సిద్ధమవుతున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన దసరా ఉత్సవాలను నేడు పల్లెల్లోనూ ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఉత్సవ కమిటీలు ఏర్పడి దుర్గాదేవికి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.

క్లస్టర్ పరిధిలో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 120 గ్రామాలు ఉన్నాయి. రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటుగా గ్రామాల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఉత్సవ కమిటీలు చేపడుతున్నాయి. ఇప్పటికే రాట ముహూర్తాలను నిర్వహించారు. మండపేట, రామచంద్రపురం, ద్రాక్షారామ, వెదురుపాక విజయదుర్గా పీఠం, పసలపూడి, మాచవరం, ఏడిద, ద్వారపూడి, కపిలేశ్వరపురం, అంగర, కె.గంగవరం , పామర్రు, టేకి, వల్లూరు, కోరుమిల్లి, కేదారిలంక, కాజులూరు, గొల్లపాలెం వంటి గ్రామాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

ఉత్సవ మండపాలు ఏర్పాటు

సోమవారం నుంచి వచ్చే నెల ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామగ్రామాన చలువ పందిళ్లు, మండపాలను సిద్ధం చేశారు. ఒక్కో గ్రామంలో నాలుగు నుంచి ఐదు చోట్ల ఉత్సవ కమిటీలు అమ్మవారిని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీలు దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై గ్రామాలకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

పీఠంలో ఏర్పాట్లు పూర్తి

విజయదుర్గా పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారిని రోజుకొక రీతిలో అలంకరించి పూజలు నిర్వహించనున్నారు. భక్తులు స్వయంగా అమ్మవారికి ఎదురుగా కలశాన్ని పీఠంలో ఏర్పాటు చేసుకుని నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కలశాల ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

అమ్మ అనుగ్రహం కోసం పూజలు



అమ్మవారి కరుణా కటాక్షాలు ఉంటే సకల శుభాలు కలుగుతాయి. నవరాత్రుల్లో అమ్మవారిని కొలవడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. పాడి పంటలు, పసుపు కుంకాలు, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండేందుకు అమ్మవారిని రోజుకొక రూపంలో కొలవడం భక్తుల విశ్వాసానికి ప్రతీక.

– విలపర్తి ఫణిధర్‌శర్మ, పురోహితుడు, రాయవరం


ఏర్పాట్లు పూర్తి చేశాం



పీఠంలో విజయదుర్గా అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం. తొమ్మిది రోజులు వివిధ సాహితీవేత్తలు పురాణ పఠనం చేస్తారు.

– వి.వేణుగోపాల్ (బాబి), విజయదుర్గా పీఠం, వెదురుపాక, రాయవరం మండలం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ద్రాక్షారామలో కలుసుకున్న 1978-79 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శ్రీ పీవీఆర్ హైస్కూల్లో 46 ఏళ్ల క్రితం 1978–79లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకుని స్నేహితులతో సందడిగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శ్రీమన్నారాయణ, చెరుకు సూర్యనారాయణ దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మెనవల్లి వెంకన్న, గంధం మురళీకృష్ణ, పెంకే సత్యనారాయణ, బోనం శ్రీను, ముప్పనపల్లి పల్లంరాజు, చక్కా సోమరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్ర అనుబంధ కమిటీల్లో నియామకంపై హర్షం



పలివెల సుధాకర్



శెట్టి నాగేశ్వరరావు



కట్టా వెంకట శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో మండపేట నియోజకవర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన సీనియర్ నేత పలివెల సుధాకర్, రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ కార్యదర్శిగా మండపేట పట్టణానికి చెందిన శెట్టి నాగేశ్వరరావు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలపై పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం వారి నియామకపై ఓ ప్రకటన విడుదల చేసింది. పలివెల సుధాకర్, శెట్టి నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వంలో జిల్లా వ్యాప్తంగా పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పాటుపడతామని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కర్రి పాపారాయుడు తదితర నాయకులకు సుధాకర్, నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

కట్టా శ్రీనుకు అభినందనలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం గ్రామానికి చెందిన కట్టా వెంకట శ్రీనివాసరావు (శ్రీను) వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియామకం పొందారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం రాత్రి ఆయన నియామకంపై ఉత్తర్వులు వెలువడ్డాయి. కట్టా శ్రీను నియామకంపై నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కట్టా శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలకు పూర్తి న్యాయం చేస్తానని అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి సర్పంచ్‌పై జనసేన యువత నిరసన



ద్రాక్షారామ నున్న వారి వీధిలో బైఠాయించి నిరసన తెలుపుతున్న జనసేన యువత

రామచంద్రపురం రూరల్: కూటమి పార్టీలో తెలుగు దేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ద్రాక్షారామ సర్పంచ్‌పై జనసేన యువత ఆదివారం నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే ద్రాక్షారామ నున్న వారి వీధిలోని జెడ్పీ హైస్కూల్ సమీపంలోని స్పీడు బ్రేకర్‌ను సర్పంచ్ అరుణ ఆదేశాలతో తొలగించారని ఆరోపిస్తూ జనసేన యువకులు కర్రా నాగేశ్వరరావు (తాతీలు), బి.సూరిబాబు, కె.దుర్గాప్రసాద్, దేవానందం, రామకృష్ణ తదితరులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఆందోళన అనంతరం సర్పంచ్‌పై ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో కూటమి నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

శిథిలావస్థలో వంతెన



వట్రపూడిలో శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: అద్దంపల్లి–వట్రపూడిలో రహదారిలోని పంట కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారి మీదుగా నిత్యం వందలాంది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కాజులూరు మండలం, కె.గంగవరం మండలం ప్రజలు ద్రాక్షారామ వచ్చేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుంది. వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరు వైపులా రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ప్రయాణీకులు ప్రమాదాల బారీన పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన పూర్తిగా కూలిపోయే స్థితికి చేరిందని వారన్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త !

- పండుగ వేళ చోరీలు జరిగే అవకాశం
- అప్రమత్తంగా వ్యవహరించాలంటున్న పోలీసులు

రాయవరం: దసరా వచ్చేసింది. సరదాలు తీసుకువస్తోంది. సోమవారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో చాలా మంది సొంత గ్రామాలకు, దైవ దర్శనాలకు, విహార యాత్రలకు ప్లాన్ చేసుకున్నారు. మరికొందరు తమ చిన్నారులను తీసుకుని బంధువులు, స్నేహితుల ఇళ్లకు బయలు దేరేందుకు ప్రయాణ సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసు కోవాలని పోలీసులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

ఊరికి వెళ్తే పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. తద్వారా పోలీసులు రాత్రి వేళ ఇంటి పరిసరాల్లో గస్తీ నిర్వహిస్తారు. ఊరికి వెళ్తున్న విషయాన్ని కనిపించిన అందరికీ చెప్పకూడదు. సెలవు దినాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా గ్రామాల్లో, వీధుల్లో తిరుగుతూ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

పెట్రోలింగ్ పెంచుతాం



దసరా పండుగల నేపథ్యంలో పిల్లలకు సెలవులివ్వడంతో సొంత ఊర్లకు వెళ్తున్న వారు తగు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానికులు వెంటనే డయల్ 100 లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. 112కు కాల్ చేసినా సిబ్బంది అప్రమత్తమవుతారు. ఊర్లకు వెళ్తున్న వారు తప్పకుండా పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇస్తే రాత్రి వేళల్లో ఆ ప్రాంతంలో పోలీసు సిబ్బంది పహారా కాస్తారు. సెలవుల నేపథ్యంలో రాత్రివేళ పెట్రోలింగ్ మరింత పెంచుతాం.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలపై నిఘా ఏదీ?

- లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం
- కానరాని తనిఖీలు
- స్ట్రీట్ ఫుడ్ నాణ్యతపై అధికారుల పరిశీలన కరవు
- నిబంధనలు పాటించకుంటే ప్రజారోగ్యానికి హాని



అమలాపురంలో రోడ్డు చెంతన తినుబండారాలు విక్రయించే తోపుడు బండ్లు, దుకాణాలు

అమలాపురం టౌన్: రోడ్ల చెంతన, వీధుల్లో ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లు, బజ్జీ, పానీపూరి బండ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చిరు వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారులనే సానుభూతి చూపి సానుకూలంగా ఉందామన్నా వారు విక్రయించే తిను బండారాలతో ప్రజల ఆరోగ్యాలు గుల్లవుతున్నాయి.

యువతా మేలుకో..

ఆహార పదార్థాలను సరైన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేసి విక్రయిస్తే ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులూ భాగస్వామ్యులు అవుతారు. అమలాపురం పట్టణం, 216 జాతీయ రహదారి విస్తరించిన పరిసర గ్రామాల రోడ్ల చెంత ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు అనేకం వెలిశాయి. దీనికి తోడు మిరపకాయ బజ్జీలు, న్యూడిల్స్, పానీ పూరి, మాంసపు పకోడీ విక్రయించే తోపుడు బండ్లు ప్రతి వీధిలో దర్శనమిస్తున్నాయి. నూనెను అనేకసార్లు మరిగించి అదే నూనెలో ఆహార పదార్థాలు వేపడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఆహార కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నది తొలుత యువతే. ఇటీవల ముఖ్యంగా యువతీ యువకులు ఏదైనా సుస్తీ చేసి ఆస్పత్రులకు వెళితే తొలుత డాక్టర్లు చెబుతున్నది ఒక్కటే ఫాస్ట్ ఫుడ్, వీధి బళ్లమీద విక్రయించే ఆహారం తీసుకోవద్దని సలహా ఇస్తున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ అధికారుల నిఘా కరువైంది. హోటళ్లపై మాత్రమే దాడులు చేసి తనిఖీ చేస్తున్నారు. తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నీరుగార్చేస్తున్నారు. అమలాపురంలో గతేడాది రెండు ప్రముఖ హోటళ్లలో నిల్వ ఆహార పదార్థాల ఉంచారని ఫిర్యాదులు రావడంతో అధికారులు దాడులు చేసి అనంతరం పట్టించుకోలేదు.

120కి పైగా తాత్కాలిక షాపులు, తోపుడు బండ్లు

అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల రోడ్ల చెంత తాత్కాలికంగా పాస్ట్‌ఫుడ్, న్యూడిల్స్, పానీ పూరి, మాంసపు పకోడీల షాపులు, తోపుడు బండ్లు 120కి పైగా ఉన్నాయి. సాయంత్రం అయితే చాలు వారంతా తమ వ్యాపారాలను మొదలుపెడతారు. మరిగించిన నూనెలో మాంసపు ముక్కలు, మిరప కాయ బజ్జీలు, మాంసపు పకోడీలను వేపడంతో వాటిని తిన్న వారి ఆరోగ్యం క్రమేపీ పెను ప్రమాదంలో పడుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఇక న్యూడిల్స్, పానీపూరి, ఫ్రైడ్ రైస్ షాపులు ఈ కోవలోకే వస్తాయి.

తోపుడు బండ్ల వ్యాపారులు, చిరుతిళ్ల విక్రయదారులు సరైన పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజా ఆరోగ్యంతో పరోక్షంగా చెలగాటం ఆడుతున్నారు. ఈ షాపులు, తోపుడు బండ్లపై గ్యాస్ సిలిండర్లు వాడడం, నూనె మరగడం వల్ల వచ్చే పొగతో పట్టణంలో కాలుష్యం కమ్ముకుంటోంది. పట్టణంలో గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, కలశం సెంటరు, హైస్కూలు సెంటరు, కొంకాపల్లి ఎత్తురోడ్డు, వై. జంక్షన్, ఎర్ర వంతెన, నల్ల వంతెన రోడ్లు, మొబర్లీ పేట ఇలా చెప్పుకుంటూ పోతే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెడీమేడ్ ఆహార పదార్థాలు విక్రయించే తోపుడు బండ్లు అనేకం దర్శనమిస్తాయి.

దృష్టి సారించని అధికారులు

మున్సిపాలిటీ పరంగా శానిటేషన్, ఎన్విరాల్‌మెంట్ విభాగం అధికారులకు ఈ సెంటర్లు, షాపులను తనిఖీ చేసే అధికారం ఉన్నా వారు ప్లాస్టిక్ కవర్లు తదితర సామగ్రిపైనే దృష్టి పెట్టి దాడులు చేస్తున్నారే తప్ప కల్తీ ఆహారం విక్రయాలు, కాలుష్యంపై దృష్టి సారించడం లేదు. ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు ఈ తరహా దుకాణాలను తనిఖీలు చేస్తే నిర్వాహకులకు కనీసం భయమైనా ఉంటుంది. ఈ దుకాణాల నిర్వహణకు ఎవరూ లైసెన్సులు తీసుకోవడం లేదు. కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు ఈ తరహా దుకాణాలు, తోపుడు బండ్ల వల్ల కలిగే కాలుష్య సమస్యపై పర్యవేక్షించడం లేదు. ఇలా ఎవరికి వారు ఆయా శాఖల అధికారులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెడీమేడ్ ఆహార పదార్థాలు విక్రయించే తోపుడు బండ్లపై నిఘా పెట్టకపోవడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వ్యాపారులు ఫుడ్ కలర్స్, టేస్టింగ్ సాల్ట్ ఆహార ఉత్పత్తుల్లో రంగు, రుచి కోసం అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇవి మోతాదు మించితే ఆరోగ్యంపై తీవ్ర నష్టం కలిగిస్తాయి.

వీధి వ్యాపారులు విధిగా లైసెన్సులు పొందాలి

ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రోడ్ల చెంత తినుబండారాలు విక్రయించే ప్రతి వీధి వ్యాపారి తప్పని సరిగా లైసెన్స్‌లు పొందాలి. ఇప్పటికే రోడ్ల చెంత తినుబండారాలు విక్రయించే స్ట్రీట్ ఫుడ్ వెండర్లు, దుకాణాలను తనిఖీలు చేస్తున్నాం. ఇకపై స్పెషల్ డ్రైవ్ తరహాలో ఈ తోపుడు బండ్లు, దుకాణాలపై నిఘా పెంచుతాం. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా, కాలుష్యం కలిగించేలా వ్యాపారులు వ్యవహరిస్తే వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటాం.

– వై.రామయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

350 మందికి వైద్య పరీక్షలు



మండపేటలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కపిలేశ్వరపురం (మండపేట): రాజమహేంద్రవరంలోని రీజియన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండపేట టౌన్ హాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎముకలు, దంత, పల్మనాలజీ విభాగాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై ఉచితంగా పరీక్షలు చేశారు. ఆయా విభాగాల వైద్యులు షేక్ వసీమ్ రజా అన్సారీ, ఎండీ నిహాల అషా, బిల్లాల్ మహమ్మద్, షేక్ నీలోఫర్ వైద్య సేవలందించారు. 350 మందికి ఉచితంగా కొలెస్ట్రాల్, బీపీ, సుగరు సంబంధిత రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ , మహమ్మద్ రహీమ్, కరీం, మండిపూడి చంద్రశేఖర్, జగతా రఘువీర్ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కపిలేశ్వరపురం (మండపేట): విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గీయుల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆ సామాజిక వర్గం నేతలు కోరారు. మండపేటకు చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం నేత వీరమల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలోని సభ్యులు ఆదివారం రామచంద్రపురంలో మంత్రి సుభాష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనివ్వాలని వారు కోరారు. నాయకులు రాజశేఖర్, పెదబాబు, శ్రీనివాస్, చినబాబు, నాగబాబు, కోటేశ్వరరావు, భీమశంకర్, కృష్ణ పోలరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

నేటి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

అమలాపురం రూరల్: పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల ఏర్పాటు చేసిన అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో రెండవ దశ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహ స్వామి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అడ్మిషన్ల కన్వీనర్ పి.కరుణశ్రీ తెలిపారు. అడ్మిషన్ల కో కన్వీనర్స్ డాక్టర్ ఏం.బాల స్వామి, డాక్టర్ బి.ఆశిష్ బాబు, అధ్యాపకులు పి. శేఖర్, ఎస్. రాజతేజ, మురళీ కృష్ణ పాల్గొన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9491191635, 9490977555 సంప్రదించాలన్నారు.

తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం: కొమానపల్లి కావూరి చంటమ్మ ఇంట్లో ఆదివారం ఆరడుగుల తాచుపాము హల్‌చల్ చేసింది. తాచుపాము సంచరించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అతను అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా ప్లాస్టిక్ డబ్బాలో బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.